


సమావేశంలో మాట్లాడుతున్న వెటర్నరీ డీఆర్ డా.ఏకాంబరం

## గుడ్డు ఆరోగ్యానికి ఎంతో మేలు

- కరోనా అనంతరం వినియోగం పెరిగింది
- వెటర్నరీ డీఆర్ డా.ఏకాంబరం

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 13: గుడ్డు ఆరోగ్యానికి ఎంతో మేలని, కరోనా అనంతరం తెలంగాణలో కూడా వినియోగం పెరిగిందని రాజేంద్రనగర్ పీవీ నర్సింహా రావు వెటర్నరీ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డా.ఏకాంబరం తెలిపారు. శుక్రవారం వర్సిటీ కళాశాల అవరణలో ఏర్పాటు చేసిన, ప్రపంచ గుడ్డు దినాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడారు.. ఆరోగ్యకరమైన జీవితానికి పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి, శరీరానికి కావాల్సిన కొవ్వు, వృద్ధాప్య ఛాయలు నిరోధించడానికి గుడ్డు ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరం భారత్‌లో 12,960 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యాయని తెలిపారు. దక్షిణ భారత్ నుంచే ఎక్కువ ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కానీ వినియోగంలో ఆసించిన స్థాయిలో లేదన్నారు. కరోనా అనంతరం మన ప్రాంతంలో కూడా వినియోగం పెరిగిందని, మరింత పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లోని మన వర్సిటీ నుంచే కాకుండా డైరెక్టరేట్ ఆఫ్ ఫౌల్ట్రీ నుంచి వారానికి దాదాపు 50 లక్షల కోడి పిల్లలను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డా.మహేందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బడులు, అంగన్వాడీ కేంద్రాలకు, గర్భిణులకు గుడ్డు అందించడం హర్షనీయమన్నారు. అతి తక్కువ ధరలో లభించే కోడి గుడ్డు మంచి పౌష్టికాహారమని.. ప్రతి రోజు కోడి గుడ్డును ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కళాశాల డీన్ డా.రఘునందన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇతర యూనివర్సిటీ అధికారులు, ఎస్.రవీందర్ రెడ్డి, డా.మాధురి, డా.ఎస్. సాయిరెడ్డి, శ్రీలత, ఆర్.పురుషోత్తం, ఎస్.రవీందర్ రెడ్డి, ఇతర కళాశాల ఆచార్యులు పాల్గొని పలు సూచనలు చేశారు. పశువైద్యశాల క్యాంపస్‌లో బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు.

## యువతలో దేశభక్తిని పెంపొందించాలి




ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల అసోషియేట్ డీన్ డా.నరేందర్ రెడ్డి, విద్యార్థులు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 13: యువతలో దేశ భక్తిని, సంస్కృతి సంప్రదాయాలను పెంపొందిచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ పొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డా.నరేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మేరీ మాటి మేరీ దేశ్ (నాభూమి నాదేశం) కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే వృత్తాంతంతో కలష యాత్రను నిర్వహించారు. దేశప్రజలలో ఐక్యమత్యాన్ని, దేశంకొరకు అమరులైన వీర జవాన్‌ల జ్ఞాపకార్థం నిర్వహించారు. 300మంది వలంటీర్లు 9 కళాశాలలో పంచ్‌ప్రాన్ ప్రతిజ్ఞ తీసుకుని విశ్వవిద్యాలయం, కళాశాలలోని వివిధ ప్రాంతాల్లో పవిత్ర మట్టిని సేకరించి, దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్మిస్తున్న అమృత్ వాటికన్ నిర్మాణంకు పంపిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ద్వారా నిర్వహిస్తున్నట్లు డీఎస్ఎ డా.జెల్లా సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవాపథకం అధికారులు, వలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15 నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 13: కాటేదాన్‌లోని వెంకన్న గుట్టపై వెలిసిన పద్మావతి గోదా సమేత సాలాగ్రామ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను ఈనెల 15 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలక కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు శనివారం దేవాలయం ఆవరణలో మహోత్సవాలకు సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు.

# బీసీల వైపే.. పార్టీల చూపు

- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 3లక్షలకు పైగా బీసీ ఓటర్లు
- రెండోస్థానంలో మైనార్టీ ఓటర్లు
- పదివేలు దాటిన కొత్త ఓటర్లు
- మూడు పర్యాయాలుగా బీసీ అభ్యర్థుల మధ్యే తీవ్రపోటీ
- ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్
- ధీటైన ప్రత్యర్థి కోసం కాంగ్రెస్, బీజేపీల వెతుకులాట
- క్రీయాశీలకంగా మారనున్న కొత్త ఓటర్లు

మణికొండ, అక్టోబర్ 13: రంగారెడ్డి జిల్లాలోని 14 శాసనసభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో కొత్తగా ఏర్పడిన రాజేంద్రనగర్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ధనిక నియోజకవర్గంగా అవతరించింది. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఈ నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కాగా ఇక్కడ రాజకీయ పరిణామాలు ఎంతో క్రీయాశీలకంగా కొనసాగుతాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో తాజా ఓటరు జాబితా ప్రకారం.. 5,52,362కు చేరుకుంది. 2018 సార్వత్రిక ఎన్నికల సమయంలో 4,41,005 మంది ఓటర్లు ఉండగా గడిచిన ఐదేండ్లకాలంలో నియోజకవర్గంలో కొత్తగా 1,11,357 ఓట్లు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకునేందుకు 10,488 మంది ఓటరు నమోదు చేసుకున్నారు. తుది జాబితా వచ్చేలోపు మరో మూడు వేల వరకు పెరగవచ్చునని తెలుస్తుంది. ఇదిలావుంటే నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఇక్కడ బీసీలదే ఆధిపత్యం కొనసాగుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రస్తుత ఓటర్ల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే 3లక్షల61వేల ఓటర్లంతా బీసీలే కావడం గమనార్హం. లక్షా 32వేల పైచీలుకు మైనార్టీ ఓటర్లు, ఇతర వర్గాలకు వారు నియోజకవర్గంలో ఉన్నారు. అయితే ఇక్కడ రాజకీయం మొత్తం బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడ బరిలో అన్ని రాజకీయ పార్టీల నుంచి బీసీల మధ్యే హోరాహోరి పోటీ కొనసాగుతుండగా ఈసారి ఏ సామాజిక వర్గాల మధ్య పోటీ ఉంటుందని స్థానికంగా ఆసక్తి నెలకొన్నది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. దీంతో ఈ ప్రాంతంలో ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకుని ఓటర్లుగా నమోదయ్యారు. వీరంతా ఏ పార్టీలకు మద్దతు పలుకుతారనేది ప్రశ్నగా మిగిలింది.

### బీసీ అభ్యర్థులకు కాంగ్రెస్, బీజేపీ ప్రాధాన్యత ఇస్తారా..?

ఇక వివిధ రాజకీయ పార్టీల్లో బీసీ నేతలే క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నా ఆయా పార్టీలు ఏ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు ఎమ్మెల్యే టిక్కెట్లు కట్టబెడతారా అనే అంశంపై బీసీ వర్గాల చర్చనెలకొన్నది. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కే మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీలోనూ బీసీల మధ్యే ఆశావహుల పోటీ ఉన్నప్పటికీ తాండూరు టిక్కెట్టు ఆశిస్తున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా బీజేపీ పార్టీ నుంచి 56 మంది ఆశావహులు ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం దరఖాస్తులు చేసుకోగా వీరిలో ప్రధానంగా తోకల శ్రీశైలంరెడ్డి, అతడి తనయుడు కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, తోక అంజన్‌కుమార్‌గౌడ్, కె.నరేందర్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అంతేగాక మజ్లిస్ పార్టీ నుంచి సైతం ఈసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకే బరిలో ఉంటే టిక్కెట్టు కట్టబెట్టాలని యోచిస్తున్నట్లు తెలిసింది. బలమైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు కాకుండా ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు టిక్కెట్టు కట్టబెడితే రాజేంద్రనగర్‌లో సార్వత్రిక ఎన్నికల పోరు రసవత్తరంగా సాగనుంది.

**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు..**

| | |
|---|---|
| మొత్తం ఓటట్లు | 5,52,362 |
| మహిళలు | 2,88,270 |
| పురుషులు | 2,64,053 |
| థర్డ్ జెండర్‌లు | 39 |
| దివ్యాంగులు | 3,738 |
| వృద్ధులు | 5002 |
| కొత్త ఓటర్లు | 10,488 |
| ఎన్ఆర్ఐలు | 80 |
| సర్వీసు ఓటర్లు | 93 |
| పోలింగ్ బూత్‌ల సంఖ్య | 535 |

# జూకల్ - పెద్దషాపూర్ గ్రామాల మధ్యలో రైల్వే బ్రిడ్జి మంజూరు

- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక నాయకులు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 13: జూకల్- పెద్దషాపూర్ గ్రామాల మధ్యలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం మంజూరు కావడంతో శుక్రవారం రైల్వే అధికారులు స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. జూకల్-పెద్దషాపూర్ గ్రామాల మధ్య రైల్వేగేటుతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయడానికి అనుమతులు వచ్చిన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి రాయలసీమ, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలకు వెళ్లడం కోసం రైలు ఇక్కడి నుంచి రాకపోకలు జరుగుతుంటాయని వివరించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయడం కోసం బ్రిడ్జి నిర్మాణం చేయడానికి అనుమతి వచ్చిందన్నారు. నిధులు సైతం మంజూరు చేశారని వివరించారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తామని తెలిపారు.

### ఏండ్ల నాటి సమస్య తీరనుంది..

ఏండ్ల నాటి నుంచి రైల్వే గేటుతో జూకల్ గ్రామం మీదగా రాకపోకలు నిర్వహించే ప్రజల ఏండ్లనాటి సమస్య తీరనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూకల్- పెద్దషాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న రైల్వే లైన్‌తో రైలు వచ్చినప్పుడు ప్రయాణికులు గంటల తరబడి నిలబడి అనేక ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను గుర్తించి స్థానిక ప్రజాప్రతినిధులు చేవెళ్ల ఎంపీ రంజీత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు రైల్వే అధికారులను పలు మార్లు వినతి పత్రాలు ఇవ్వడంతో స్పందించిన రైల్వే అధికారులు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయడానికి అనుమతి ఇవ్వడంతో పాటు నిధులు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేసిన చేవెళ్ల ఎంపీ రంజీత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, శంషాబాద్ ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కే.చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జూకల్ గ్రామ సర్పంచ్ కోడూరి నర్సమ్మ, ఉప సర్పంచ్‌లు మన్నేమల్లారెడ్డి, రాజు నాయక్, మాజీ సర్పంచ్ పోరెట్టి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్యనందం, పవన్ కుమార్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, సిద్ధులు, కృష్ణ, లింగంగౌడ్, నరేశ్‌గౌడ్, దినేశ్‌గౌడ్, చాకలి భిక్షపతి, బి.శ్రీనివాస్ ఉన్నారు.



జూకల్- పెద్దసాపూర్ గ్రామాల మధ్య రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు, స్థానిక నాయకులు

